## శిలాఫలకాలను లెక్కించేందుకే

# ప్రతిపక్షాలకు ఐదేండ్లు గావాలె



సికింద్రాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

- మాయమాటల మత్తులో పడొద్దు
- మంచి, చెడు, అభివృద్ధిపై యువత ఆలోచించాలి
- అభివృద్ధివైపు నిలబడాలి
- మంత్రి ప్రశాంత్‌రెడ్డి
- భీమ్‌గల్ మండలంలో రూ. 43 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భీమ్‌గల్, అక్టోబర్ 4 : బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం తాను ప్రారంభించిన శిలాఫలకాలను లెక్కించేందుకే ప్రతిపక్షాల నాయకులకు ఐదేండ్లు పడుతుందని రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శిలాఫలకాలపై నంబర్లు వేసుకుంటూ వస్తే ఇప్పటివరకు తాను చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. మండలంలో పలు తండాలు, గ్రామాల్లో ఒక్కరోజే రూ. 43కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపనలు చేశారు. ఇందులో ప్రధానంగా రోడ్లు, గోదాములు, రోడ్ డ్యాములు ఉన్నాయి. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో బాల్కొండ నియోజకవర్గంలో వందల కోట్లతో అభివృద్ధి పనుల పరంపర కొనసాగుతున్నదని తెలిపారు. కొంతమంది అజ్ఞానంతో ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులని అసత్యాలు మాట్లాడుతున్నారని అన్నారు. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టిన ట్యాక్స్ నుంచే తిరిగి నిధులు వస్తాయన్నారు. రూ. 100 చెల్లిస్తే



ముచ్కూర్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మంత్రి వేముల

అభివృద్ధి కోసమని 40 రూపాయలు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని ఉదహరించారు. అవి కూడా స్థానిక ఎమ్మెల్యేలు ప్రపోజల్స్ పెడతారని, విచక్షణాధికారం మేరకు ఏ పనులు పెట్టాలనేది ప్రజల అభీష్టం మేరకు ఎమ్మెల్యే నిర్ణయం ఉంటుందని వివరించారు.

కేంద్రం ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వలేదని తేల్చి చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని, వారి మాయమాటల మత్తులో పడొద్దని సూచించారు. మంచి, చెడు, అభివృద్ధిపై ఆలోచన చేసే శక్తి యువతకు ఉందని, అభివృద్ధివైపు నిలబడాలని కోరారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా, అసత్య ఆరోపణలు చేసినా బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి ఆగబోదని స్పష్టం చేశారు. మీ అభివృద్ధి కోరుకునే మీ బిడ్డనైనా తనను కడుపులో పెట్టుకొని కాపాడుకోవాలని ప్రజలను కోరారు. మంత్రి వెంట హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, డీసీసీబీ వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి, రైతునాయకుడు కోటపాటి, జడ్పీటీసీ రవి, కమ్మర్‌పల్లి ఏఎంసీ చైర్మన్ గుణ్‌వీర్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, సొసైటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్

## కామారెడ్డి అభివృద్ధే ధ్యేయం

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- జిల్లాకేంద్రంలో రూ. 9కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం
- పట్టణాభివృద్ధికి రూ. 20కోట్లు మంజూరైనట్లు వెల్లడి

కామారెడ్డి, అక్టోబర్ 4: కామారెడ్డి పట్టణంతోపాటు మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల అభివృద్ధే తన ధ్యేయమని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంతోపాటు పట్టణ పరిధిలోని దేవునిపల్లి, లింగాపూర్ గ్రామాల్లో రూ. 9 కోట్ల 12 లక్షల 55 వేలతో పూర్తిచేసిన యోగా భవనం, పెరుక సంఘ భవనం, దోబీ ఘాట్, మెప్మా భవనం, కమ్యూనిటీ హాళ్లు, సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీలను బుధవారం ప్రారంభించారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణ అభివృద్ధే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్నదని చెప్పారు. పట్టణాభివృద్ధికి మరో రూ.20కోట్లు మంజూరైనట్ల గంప గోవర్ధన్ వెల్లడించారు. కార్యక్రమలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందూప్రియ, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేశ్, యోగా గురువు గరిపల్లి అంజయ్య, యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడి, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



యోగా భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్



సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే షిండే

## అన్ని రంగాల్లో 'జుక్కల్' అభివృద్ధి

- ఎమ్మెల్యే హన్మంత్‌షిండే
- మద్నూర్ మండలంలో రూ. 16కోట్ల పనులకు శంకుస్థాపన

మద్నూర్, అక్టోబర్ 4: జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. మండలంలో సుమారు రూ.16 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. మండలకేంద్రంలో రూ. 9 కోట్లతో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ లైటింగ్, రూ. 5 లక్షలతో కళాశాల ప్రహరీ, రూ. 3.60 కోట్లతో గోజేగావ్ హైలెవల్ బ్రిడ్జి, రూ. 3.50 కోట్లతో సోమూర్-అంతాపూర్ బ్రిడ్జి, సోమూర్, రాచూర్‌కు బీటీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా షిండే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రోడ్లకు రూ.350 కోట్లు, పంచాయతీరాజ్ రోడ్లకు రూ. 300 కోట్లు మంజూరయ్యాయని, ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మద్నూర్ వాసుల చిరకాల కోరిక అయిన డిగ్రీ కళాశాలను సైతం సీఎం మంజురు చేశారని, బిచ్కుందలో పీజీ, నిజాంసాగర్‌లో జూనియర్ కళాశాలలను మంజురు చేశారని వెల్లడించారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీబాయి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బన్సీపటేల్, సొసైటీ చైర్మన్ శ్రీనుపటేల్, సర్పంచుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దరాస్ సురేశ్, గఫార్, ఆత్మ కమిటీ చైర్మన్ కొండ గంగాధర్, సొసైటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఫ్యామిలీని విమర్శిస్తే బట్టలూడదీసి కొడతాం

- బాండ్ పేపర్ ఎంపీ అర్వింద్‌కు ఇక పొలిటికల్ ఎండ్ పేపర్
- పసుపు బోర్డు ఓ బూటకం.. ఎన్నికల నాటకం
- మొన్న ఇయ్యమన్నోళ్లు.. ఇప్పుడెట్ల ఇస్తమంటున్నరు?
- విలేకరు సమావేశంలో ప్రధాని, ఎంపీపై ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆగ్రహం




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, అక్టోబర్ 4 : సీఎం కేసీఆర్ కుటుంబంపై అనవసరంగా నోరు పారేసుకుంటే బట్టలూడదీసి కొడతామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హెచ్చరించారు. పసుపు బోర్డు తెస్తానని బాండ్ పేపర్ రాసిచ్చిన అర్వింద్‌కు అది పొలిటికల్‌గా ఎండ్ పేపర్‌గా మారిందన్నారు. అందుకే చెత్తబుట్టలో పడేసిన బాండ్ పేపర్‌తో మరోసారి ఎన్నికల నాటకం ఆడుతున్నారని మండిపడ్డారు. అయినా బీజేపీని ఇక రైతులు నమ్మే స్థితిలో లేరని అన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రధాని, ఎంపీపై నిప్పులు చెరిగారు. జిల్లాలో అర్వింద్ ఎక్కడ కనబడినా తాట తీస్తామని హెచ్చరించారు. దమ్ముంటే ఆర్మూర్‌లో తన మీద పోటీ చేయాలని, డిపాజిట్ కూడా దక్కనివ్వనని సవాల్ విసిరారు. బీజేపీ కమలదళం కాదని, హమ్లా దళమని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవంపై గుజరాతీ గుండాయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. మోదీ బాహర్ వాలా అని.. కేసీఆర్ ఘర్‌వాలా అని అన్నారు. ఇక్కడ మోదీ ఆటలు సాగనివ్వబోమని స్పష్టం చేశారు. సూటూ, బూటు, నోటు, ఓటు.. మోదీ సిద్ధాంతమని, నీళ్లు, నిధులు, నియామకాలు కేసీఆర్ సిద్ధాంతమని అన్నారు. కేసీఆర్ అంటే నమ్మకం, మోదీ అంటే అమ్మకం అని తెలిపారు. పసుపు బోర్డు ఓ ఎన్నికల నాటకమని, పవిత్రమైన పసుపును బజారుకీడ్చిన బీజేపీ మట్టికొట్టుకుపోతుందన్నారు. దేశంలో బీజేపీకి ఎదురుగాలి వీస్తోందని తెలంగాణలో ఒక్క చోటకూడా డిపాజిట్ రాదన్నారు. కవిత ఎంపీగా ఉన్నప్పుడు పసుపు బోర్డు కోసం తొక్కని గడపలేదని, మొక్కని దేవుడు లేదని గుర్తుచేశారు. నిన్నటి వరకు ఇవ్వలేమన్న పసుపుబోర్డు.. ఇప్పుడెలా సాధ్యమైందని ప్రశ్నించారు. రైతులపై ప్రేముంటే మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజనపై మోదీ విషయం కక్కని రోజు లేదని, తెలంగాణ చావు చూసే దాకా నిద్ర పోకూడదన్నంత ద్వేషం పెంచుకున్నాడని ఆరోపించారు. ఓట్లు దండుకోవడానికే నేడు తెలంగాణలో ఊరేగుతున్నాడని ఎద్దేవా చేశారు. సింగరేణి గనులు సహా పదేండ్లుగా సీఎం కేసీఆర్ సృష్టించిన అపారమైన సంపదను అదానీకి దోచిపెట్టాలనే దుర్బుద్ధి మోడీలో కనిపిస్తున్నదని అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను సర్వనాశనం చేసిన బీజేపీ ఒక డర్టీ పిక్చర్ అన్నారు. ఎలక్షన్ మూవీలో మోదీ అనేక వేషాలేస్తున్నారని ఎద్దేవా చేశారు. నేతి బీరకాయలో నెయ్యి ఉండదని, మోదీ మాటల్లో నిజం ఉండదని విమర్శించారు.